సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 26 । జనవరి । 2025



నువ్వా.. నేనా..!

పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ప్రస్తుత ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గాలు 'నువ్వా, నేనా' అన్నట్లు తీవ్ర విభేదాలతో వ్యవహరిస్తున్నాయి. -IIలో



బాబు గ్రాఫిక్ విన్యాసాలు

సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనలో గ్రాఫిక్ విన్యాసాలు తప్ప పెట్టుబడులు తీసుకు రాలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. -IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.4/17.1

జిల్లాలో శనివారం 17.1- 31.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

మెప్మా పీడీగా కిరణ్‌కుమార్

కడప కార్పొరేషన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎం.కిరణ్ కుమార్ నియమితులయ్యారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఆయనను మెప్మా పీడీగా నియమించారు. ఈ మేరకు డైరెక్టర్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారు ఉత్తర్వులు జారీ చేశారు.

చెక్‌పోస్టులలో కట్టుదిట్టంగా తనిఖీలు

కడప కోటిరెడ్డిసర్కిల్: చెక్‌పోస్టుల వద్ద గంజాయి, అక్రమ మద్యం, నిషేధిత పదార్థాలు, ఇతర వస్తువుల అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టంగా తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం అర్ధరాత్రి దువ్వూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇడమడక అంతర్ జిల్లా చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పకడ్బందీగా డ్రైవింగ్ టెస్ట్‌లు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వాహనదారులకు డ్రైవింగ్ టెస్ట్‌లు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారం నగర శివారులోని ఊటుకూరు వద్ద ఉన్న జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయ ఆవరణలోని ఎఫ్‌సీ, డ్రైవింగ్ ట్రాక్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వాహనాదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ విజయ్ భాస్కర్, ఏఎంవీఐ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు పలు సమస్యలు ఫోన్ ద్వారా తెలియజేశారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్‌ఎం తెలిపారు.

జీవో 117 రద్దుపై సమావేశం

కడప ఎడ్యుకేషన్: జీవో నంబర్ 117 రద్దు.. 3,4,5 తరగతులను హైస్కూల్స్ నుంచి వెనక్కు, పాఠశాల విద్య బలోపేతంపై శనివారం కడపలోని జెడ్పీ సమావేశ మందిరంలో పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు సమావేశం(వర్క్‌షాప్) నిర్వహించారు. కేవలం ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, క్లస్టర్ హెచ్‌ఎంలు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లను ఆహ్వానించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యావేత్తలు, మీడియాకు ప్రవేశం కల్పించలేదు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం విద్యాభివృద్ధికై నిర్వహించే సమావేశానికి సంఘ నేతలను ఆహ్వానించకపోవడంపై పలు చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విద్యకు సంబంధించిన పలు అంశాలపై చర్చించడంతోపాటు వారి అభిప్రాయాలను తీసుకున్నట్లు తెలిసింది.

ఢిల్లీ వేడుకలకు రైతు దంపతులు



ఢిల్లీకి చేరుకున్న వెంకటరమణ, మునిసుబ్బమ్మ

కడప అగ్రికల్చర్: మైదుకూరు మండలం వనిపెంట గ్రామానికి చెందిన బిందు సేద్య రైతులు కైపు వెంకటరమణ, మునిసుబ్బమ్మ దంపతులు గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథులుగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఆ దంపతులు బిందు సేద్యంలో కూరగాయల తోటలు, అరటిని సాగు చేసి అధిక దిగుబడి సాధించారు. ఢిల్లీ పీఎంఓ కార్యాలయ పిలుపు మేరకు వైఎస్సార్ జిల్లాలో బిందు సేద్యంలో అధిక దిగుబడులు సాధించిన కోటాలో ఎస్సీ రైతుల విభాగంలో వీరిని ఎంపిక చేసినట్లు జిల్లా సూక్ష్మ నీటి సాగు పథక అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. వారు ఆదివారం ఢిల్లీలో జరిగే వేడుకల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

పురుషోత్తమా.. బుద్ధి ప్రసాదించుమా!

'పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా'.. అని అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర స్వామిపై ఆలపించిన కీర్తన బహుళ ప్రాచుర్యం పొందింది.

'పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా' అంటే నీ రూపాన్ని కాంచితిమి ప్రభూ.. అని అర్థం. అన్నమాచార్య జన్మస్థలి తాళ్లపాకలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీ వేంకటనాథుని ఆలయాన్ని సుందర మనోహరంగా నిర్మించింది. అక్కడ స్వామి వారు కొలువుతారనే సంతోషంతో భక్తులు ఎంతో పరవశించారు. అయితే కూటమి ప్రభుత్వం విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభంపై నిర్లక్ష్యం వహిస్తోంది.

చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా' అంటే తప్పుదారి పట్టిపోయే మానవులను సరైన మార్గంలో నడిపించి బతుకుదారి చూపించే సిద్ధిమంత్రము ఆ స్వామి అని అర్థం. కూటమి పాలకులు, టీడీపీ పాలక మండలి.. తాళ్లపాక ఆలయంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారికి బుద్ధి ప్రసాదించి ఆలయం ప్రారంభానికి నోచుకునేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.





తాళ్లపాకలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం

- అన్నమయ్య జన్మస్థలిలో శ్రీవారి ఆలయం
- వైఎస్సార్‌సీపీ పాలనలో నిర్మాణం పూర్తి
- ప్రారంభంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- పట్టించుకోని టీటీడీ పాలకమండలి
- మండిపడుతున్న భక్తజనం

రాజంపేట: 'అదివో.. అల్లదివో.. శ్రీహరివాసము.. బ్రహ్మకడిగిన పాదము'.. అంటూ సులువైన పదాలతో కీర్తనలు ఆలపించిన వాగ్గేయకారుడు అన్నమయ్య జన్మస్థలిలో.. పర్యాటకులు, యాత్రికులు శ్రీవారి (శ్రీ వెంకటేశ్వరస్వామి) దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇక్కడ అభివృద్ధి దిశగా టీటీడీ పాలకమండలి అడుగులు వేసింది. కూటమి పాలనలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఆలయ ప్రారంభం గురించి కూడా పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో నిత్యం టీటీడీ ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తున్నా.. చూస్తుపోవడమే తప్ప శ్రీవారి ఆలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన చేయకపోవడం విచారకరమని భక్తులు పెదవి విరిస్తున్నారు. ఇటీవల జరిగిన సంఘటనలతో పాలకమండలిపై భక్తుల నమ్మకం పూర్తిగా సన్నగిల్లింది.

దశాబ్దంన్నర తర్వాత..

అన్నమయ్య ఉద్యానవనంలో దశాబ్దంన్నర తర్వాత (14 ఏళ్లు) మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఎంపిక చేసిన స్థలంలో శ్రీవారి ఆలయం నిర్మించారు. టీటీడీ రూ.కోటికి పైగా వ్యయం చేస్తోంది. ఈ మార్గంలో తిరుమలకు వెళ్లే దక్షిణ భారత యాత్రికులకు ముందుగానే అన్నమయ్య జన్మస్థలిలో శ్రీవారిని దర్శించుకోవడం మహానందగా భావిస్తున్నారు. తాళ్లపాక, 108 అడుగుల విగ్రహం ప్రాంతం పార్కును టీటీడీ అటవీశాఖ సిద్ధం చేసింది. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. తర్వాత కూటమి సర్కారు రావడం, టీటీడీ కొత్తపాలకమండలి కొలువు తీరడం తదితర పరిణామాలు జరిగాయి. ఇప్పుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలిలోని శ్రీవారి ఆలయం, థీం పార్కు వైపు కూడా కూటమి కన్నెత్తి చూడటం లేదన్న అపవాదును మూటకట్టుకుంది.



విగ్రహ ప్రతిష్ఠ చేయాలి

గత ప్రభుత్వ పాలనలో అన్నమయ్య థీంపార్కులో టీటీడీ శ్రీవారి ఆలయ నిర్మితం చేసింది. అయితే ఇప్పటి టీటీడీ అధికారులు అందులో శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ చేయడం మరిచారు. ఇప్పటికైనా వారు విగ్రహ ప్రతిష్ఠ చేసి, ఆలయాన్ని ప్రారంభించాలి.



-ఎస్. గౌరీశంకర్, సర్పంచ్, తాళ్లపాక, రాజంపేట

టీటీడీ బోర్డు స్పందించాలి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహ ప్రాంతంలో శ్రీవారి ఆలయం నిర్మితం చేశారు. కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఆలయాన్ని భక్తులకు అందుబాటులో తీసుకురాలేక పోయింది. ఇప్పటికైనా టీటీడీ బోర్డు స్పందించి ఆలయాన్ని ప్రారంభించాలి.



-పి.విశ్వనాథరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ

600 జయంత్యుత్సవాల నుంచి..

అన్నమాచార్యుని 600 జయంత్యుత్సవాలు అప్పటి పాలకమండలి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో ఘనంగా జరిగాయి. 108 అడుగుల అన్నమయ్య విగ్రహావిష్కరణకు విచ్చేసిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి హామీలు ప్రకటించారు. ఆయన మరణం తర్వాత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అన్నమయ్య జన్మస్థలి గురించి మరిచిపోయాయి. అప్పటి టీటీడీ పాలకమండలి తాళ్లపాక, అన్నమయ్య థీంపార్కు అభివృద్ధికి సంబంధించి నిధుల కేటాయింపు చేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించారు. అప్పట్లో జెడ్పీచైర్మన్‌గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కృషి ఫలితంగా వైవీ సుబ్బారెడ్డి అన్నమయ్య థీంపార్కును సందర్శించారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో మళ్లీ అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధిపై దృష్టి సారించారు.

ఘనంగా వైఎస్ జయమ్మ వర్ధంతి



వైఎస్ జయమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ, వైఎస్ కుటుంబ సభ్యులు

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ, వైఎస్ కుటుంబ సభ్యులు

పులివెందుల రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తల్లి వైఎస్ జయమ్మ 18వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం పులివెందుల పట్టణంలో నిర్వహించారు. డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న వైఎస్ సమాధుల తోటలో వైఎస్ జయమ్మ సమాధి వద్ద పులివెందుల మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ, దివంగత జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మ, వైఎస్‌ఆర్ సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, మాజీ డీసీసీ చైర్మన్ తిరుపాల్ రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అలాగే వైఎస్ రాజారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పించారు.

ఖైదీల విడుదల లేనట్లే!

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏటా ఆగస్టు 15, గణతంత్ర దినోత్సవమైన జనవరి 26 తేదీలో సత్ప్రవర్తన గల ఖైదీలను విడుదల చేస్తుండేవారు. ఈ క్రమంలో కడప కేంద్ర కారాగారం నుంచి కూడా ఖైదీల విడుదలకు సంబంధించి ప్రతిపాదనలు పంపించేవారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి ఆయా కేంద్ర కారాగారాల నుంచి వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించి విడుదలకు మార్గదర్శకాలు ఇచ్చేవారు. తర్వాత అందరూ సమ్మతిస్తే నిబంధనల మేరకు పరిశీలించి ఖైదీల విడుదలకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చేవారు. కానీ ఈ ప్రతిపాదనలు కారాగార అధికారులు ఇప్పటికే ఇచ్చినప్పటికీ, ఖైదీల విడుదలకు సంబంధించి ఇంకా ఉత్తర్వులు రాలేదని కడప కేంద్ర కారాగార అధికారులు తెలియజేశారు. దీంతో ఆదివారం నిర్వహించబోయే గణతంత్ర వేడుకల సందర్భంగా ఖైదీల విడుదల లేనట్లేనని భావిస్తున్నారు.

ఓటుతో దేశాన్ని శాసించే శక్తి ప్రజలకుంది

జిల్లా ఎన్నికల అధికారి శ్రీధర్ చెరుకూరి



ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు, విద్యార్థులు

కడప సెవెన్‌రోడ్స్: తమ ఓటు హక్కు వినియోగంతో దేశాన్నే శాసించగల శక్తి ప్రజలకు ఉందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శనివారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నమోదుతోపాటు ఓటు హక్కును వినియోగించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్లమెంటు, అసెంబ్లీలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నిష్పక్షపాతంగా, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం కొత్తగా ఓటర్లుగా నమోదైన యువతకు ఎపిక్ కార్డులను అందజేశారు. జిల్లాలోని సీనియర్ ఓటర్లను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలకు మెమెంటోలు అందజేసి అభినందించారు. ముద్ర ఆకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కోటిరెడ్డిసర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీటీసీ లైంగిక వేధింపులపై విచారణ కమిటీ

- జేటీసీ నివేదికను తప్పు పట్టిన జిల్లా కలెక్టర్
- డీటీసీపై విచారణకు ఐదుగురు మహిళా అధికారుల కమిటీ
- రాజీ చేసేందుకు ఇతర జిల్లాల అధికారుల ప్రయత్నాలు



జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కడప : మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడిన జిల్లా ఉప రవాణా అధికారి చంద్రశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు వెనకడుగు వేస్తున్నారా? ఈ క్రమంలోనే రాజీ ప్రయత్నాలు ఆరంభించారా! అంటే విశ్లేషకులు అవును అనే సమాధానమిస్తున్నారు. మహిళా ఉద్యోగి ఇంటికి వెళ్లి తలుపు తట్టే స్థాయికి చేరిన డీటీసీకి రక్షణగా రాష్ట్ర స్థాయి అధికారి అండదండలుగా నిలుస్తున్నట్లు చర్చ జరుగుతోంది. దాంతో ప్రాథమిక నివేదిక తప్పుదారి పట్టినట్లు తెలుస్తోంది. వెరసి జిల్లా స్థాయి విచారణ కమిటీ తెరపైకి వచ్చినట్లు సమాచారం.

ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు



డీటీసీ చంద్రశేఖర్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణాధికారిగా జేటీసీ కృష్ణవేణిని నియమించారు. బాధిత ఉద్యోగి, ఆమె భర్త నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసి నివేదిక శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, రవాణాశాఖ కమిషనర్‌కు అందించినట్లు సమాచారం. జేటీసీ నివేదికను పరిశీలించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆపై ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి కన్వీనర్‌గా ముగ్గురు సీనియర్ మహిళాధికారులు, ఒకరు ఎన్జీఓతో కూడిన ఇంటర్నల్ కమిటీ నియమించినట్లు సమాచారం. వాస్తవాలను పరిశీలించి మూడు రోజులల్లో నివేదిక అందించాలని ఆదేశించారు. బాధిత మహిళా ఉద్యోగి సైతం ఫిర్యాదుకు వెనుకంజ వేయడం కూడా ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది. మరో మహిళా ఉద్యోగికి ఉన్నతాధికారి ద్వారా లైంగిక వేధింపులు లేకుండా ఉండాలంటే చట్టాన్ని ఆశ్రయించాలనే డిమాండ్ మహిళాలోకం నుంచి వ్యక్తమవుతోంది.

వివాదాస్పద అధికారిగా పేరు



డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

ఓ మహిళా ఉద్యోగి ఇంటికి వెళ్లి డీటీసీ చంద్రశేఖరరెడ్డి తలుపు తట్టారు. గమనించిన ఆమె తన భర్తకు ఫోన్ ద్వారా విషయం తెలియజేయడం, ఆయన డీటీసీకి ఫోన్ చేయడంతో అక్కడి నుంచి చంద్రశేఖరరెడ్డి జారుకున్నారు. ఆ తర్వాత సదరు మహిళా ఉద్యోగి భర్త రవాణా శాఖ కార్యాలయాలనికి వచ్చి డీటీసీ దూషించడంతోపాటు చితక బాదేందుందుకు ప్రయత్నించారు. తోటి ఉద్యోగులు అడ్డుకొని సర్దుబాటు చేయగా, డీటీసీ కాళ్ల బేరానికి వచ్చినట్లు సమాచారం. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో నిక్షేపితమై ఉన్నాయి. రెండు నెలల కిందట కడపలో బాధ్యతలు చేపట్టిన డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి అనతికాలంలోనే వివాదాస్పద అధికారిగా మారారు. రెండు నెలల కాలంలోనే మహిళా ఉద్యోగినులను వేధించడం పరిపాటిగా మారింది. ఈయన పని చేసిన గుంటూరు, శ్రీకాకుళం, బాపట్ల, కావలి, నెల్లూరు జిల్లాల్లో ఇదే తీరులో మహిళా ఉద్యోగుల పట్ల లైంగికంగా వేధించిన ఆరోపణలున్నాయి. అయినా కూడా సత్వర చర్యలు చేపట్టేందుకు ఆశాఖలో కీలక అధికారి వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర స్థాయి అధికారి అండదండలు

డీటీసీ చంద్రశేఖరరెడ్డికి అండగా రవాణాశాఖలో పెద్ద ఎత్తున రాజీ ప్రయత్నాలు ఆరంభమైనట్లు సమాచారం. ఆ శాఖలో కీలకంగా ఉన్న రాష్ట్ర స్థాయి అధికారి సైతం ఈ వ్యవహారంలో అండగా నిలుస్తోన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయి అధికారి అండదండలు ఉండటంతోనే ప్రాథమిక నివేదిక అస్తవ్యస్తంగా వెళ్లినట్లు తెలుస్తోంది. నిద్రలో నడిచే అలవాటు ఉన్న కారణంగానే డీటీసీ చంద్రశేఖరరెడ్డి.. ఆ ఇంటికి వెళ్లినట్లు నివేదికలో పొందు పర్చడం వివాదస్పదంగా మారినట్లు సమాచారం. జిల్లా మహిళాధికారుల నేతృత్వంలో ఫైవ్ ఉమెన్ కమిటీలో వాస్తవాలు నిగ్గుతేలాల్సిన అవసరం ఉంది. ఆ మేరకే కలెక్టర్ తదుపరి చర్యలకు సిఫార్సు సిద్ధం కానున్నట్లు సమాచారం.

ఇన్‌చార్జ్ డీటీసీగా ప్రసాద్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా ఉప రవాణాశాఖ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ప్రసాద్‌ను నియమించారు. ఈయన అన్నమయ్య జిల్లాలో డీటీఓగా పని చేస్తున్నారు. ఇక్కడ డీటీసీగా పని చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి మహిళా ఉద్యోగిపై లైగింక వేధింపులకు పాల్పడటంతో.. ఆయనను రవాణా శాఖ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.



కోటిరెడ్డిసర్కిల్‌లోని మహనీయుల విగ్రహాలకు విద్యుత్ దీపాలంకరణ

'ఘన'తంత్ర ఏర్పాట్లు



పోలీసు పరేడ్ మైదానంలో సిద్ధమైన వేదిక

76వ గణతంత్ర దినోత్సవానికి జిల్లా యంత్రాంగం ఘనంగా ఏర్పాట్లు చేసింది. ప్రధాన వేదికగా నిలుస్తున్న పోలీసు పరేడ్ మైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయి. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. పోలీసుల కవాతు, ప్రగతి శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అబ్బురంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకున్నారు.

– కడప సెవెన్‌రోడ్స్

క్లుప్తంగా

కల్నల్ సీకే నాయుడు క్రికెట్ ట్రోర్నీ ప్రారంభం

– రసవత్తరంగా ఆంధ్రా, పంజాబ్ మ్యాచ్

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో కల్నల్ సీకే నాయుడు అంతర్ రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఇందులో భాగంగా శనివారం ఆంధ్ర, పంజాబ్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పంజాబ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 83 ఓవర్లలో 211 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని జి.ఎస్.పి. తేజ 157 బంతుల్లో 8 ఫోర్లతో 70 పరుగులు చేశాడు. ఈయనకు జతగా ఎస్. డి. ఎన్.వి. ప్రసాద్ 27, రేవంత్‌రెడ్డి 23 పరుగులు చేశారు. అలాగే పంజాంబ్ బౌలర్లు క్రిష్ భగత్ 4 వికెట్లు, అర్యమన్ దలీవాల్ 2, అభయ్ చౌదరి 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

మానవ హక్కులను తెలుసుకోవాలి

– జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురప్ప

కడప రూరల్ : మానవ హక్కుల రక్షణ చట్టాలను గురిచి తెలుసుకోవాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా, నగర కమిటీలను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ షాబుద్దీన్ ,నగర అధ్యక్షులుగా ప్రసన్న కుమార్‌ను ఎన్నుకున్నారు. డాక్టర్ నజముద్దీన్, రాష్ట్ర అధ్యక్షులు అలీ షేర్ ఎస్ఎండీ తాహిర్, జిలాని, బాదుల్లా, బషీర్ బుఖారి తాహిరుల ఖాదిరి, మహిళ అధ్యక్షురాలు ఆస్మా, కిరణ్, రియాజ్ పాల్గొన్నారు.

నువ్వా.. నేనా..!

- పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్సీ మధ్య వర్గ విభేదాలు
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న మాజీ ఎమ్మెల్సీ వర్గీయులు
- ఇటీవల రేషన్ డీలర్ల విషయంలోనూ దౌర్జన్యం చేసిన మాజీ ఎమ్మెల్సీ వర్గీయులు
- అధిష్టాన వర్గానికి ఇరువురు నేతల ఫిర్యాదు



సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల అంటేనే వైఎస్ కుటుంబానికి కంచుకోట. అలాంటి కంచుకోటలో పాగా వేయాలని టీడీపీ రాష్ట్ర నేతలు విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ పరిస్థితి మరో విధంగా ఉంది. పులివెందుల టీడీపీ నేతల మధ్య వర్గ పోరు తారాస్థాయికి చేరుకుంది. పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ప్రస్తుత ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గాలు 'నువ్వా, నేనా' అన్నట్లు తీవ్ర విభేదాలతో ప్రవర్తిస్తున్నారు. వివరాలలోకి వెళితే పులివెందుల నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యథేచ్ఛగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అనుచరులు పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ప్రతి మండలంలోనూ తామే అంతా అన్నట్లుగా వ్యవహరిస్తూ పోలీసు, ఇతర అధికారులను విస్మరిస్తూ యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఉదాహరణకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోపే పులివెందులలో ఉన్న దాదాపు కోటి రూపాయల ఇసుక రీచ్‌ను బీటెక్ రవి అనుచరులు తరలించుకెళ్లడం జరిగింది. అంతేకాక ఇటీవల సంక్రాంతి పండుగ నేపథ్యంలో వేముల మండలంలోని దాదాపు రూ.15కోట్లు విలువ చేసే ముగ్గురాయిని రాత్రికి రాత్రే తరలించారు. అంతేకాక సంక్రాంతి పండుగ నేపథ్యంలో యథేచ్ఛగా ప్రతి మండలంలోనూ కోడి పందేలు, గ్యాంబ్లింగ్, గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించి లక్షలు సొమ్ము చేసుకున్నారని విమర్శలు ఉన్నాయి.

యథేచ్ఛగా గ్యాంబ్లింగ్

పులివెందుల నియోజకవర్గంలో యథేచ్ఛగా గ్యాంబ్లింగ్ జరుగుతోందని జగమెరిగిన సత్యం. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నారు. ఇటీవల వారి మధ్య విభేదాలు వచ్చి ఆ పంచాయతీ కూడా నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి వద్దకు చేరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్సీల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో ప్రస్తుత ఎమ్మెల్సీ పోలీసులపై గ్యాంబ్లింగ్ నిర్వహించకూడదని తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. గ్యాంబ్లింగ్ విషయంలో డివిజన్ పోలీసు అధికారి, రూరల్ అధికారి నిరంతరం మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు సమాచారం. వీరికి గ్యాంబ్లింగ్ ద్వారా ప్రతి నిత్యం మామూళ్లు అందుతున్నట్లు టీడీపీ కార్యకర్తలే చెబుతున్నారు. అయితే డివిజన్ పోలీసు అధికారి రూరల్ అధికారిలపై పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కేవలం గ్యాంబ్లింగ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని వీరిరువురే పంచుకోవడంపట్ల మిగతా డిపార్ట్‌మెంట్ ఎస్ఐ, సీఐలు కానీ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పలు ప్రాంతాలలో జూదం

పులివెందుల నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో మంగతాయి జూదం యథేచ్ఛగా సాగుతోంది. లింగాల మండలంలోని ఇప్పట్ల స్తోత్రీయం గుట్టలో మంగతాయి జూదం జరుగుతోంది. దీనికి ఆ మండల ఇన్‌ఛార్జి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. జూదం నిర్వహించేవారు కూడా మండల ఇన్‌చార్జి అనుచరులే కావడం గమనార్హం. ఇంతా జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అలాగే పులివెందుల పట్టణ పరిధిలోని కదిరి రోడ్డు, జెఎన్‌టీయూ వెనుక వైపు ఉన్న గుట్టలోనూ, తుమ్మలపల్లె గుట్టలోనూ, పెద్దరంగాపురం గుట్టలోనూ యథేచ్ఛగా జూదం జరుగుతోంది. అయితే పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. దీనికి ప్రధాన కారణం వారికి రోజు వచ్చే మామూళ్లేనని సమాచారం. ఇటీవల టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు జూదంపై ప్రెస్‌మీట్ కూడా ఇవ్వడం జరిగింది. అయితే ఆ నాయకుడు చెప్పినట్లుగా జూదం అరికట్టడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని చెప్పవచ్చు.

దావోస్ పర్యటనలో బాబు గ్రాఫిక్ విన్యాసాలు

- ఒక్క ఎంఓయూ కుదుర్చుకోలేదు
- పర్యటన ఖర్చు తప్ప ఒరిగింది లేదు
- తగుదునమ్మా అంటూ జగన్‌పై ఆరోపణలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జరిపిన దావోస్ పర్యటనలో గ్రాఫిక్ విన్యాసాలు, ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా పెట్టుబడి తీసుకు రాలేకపోయారని వైఎస్సార్ సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం కడపలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం దావోస్‌లో ఒక్క ఎంఓయూ కూడా కుదర్చుకోలేకపోవడం ఆయన అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు.వైఎస్సార్ జిల్లా వనిపెంటకు చెందిన సునీల్‌కుమార్ అనే వ్యక్తికి ఒక కోటు తగిలించి పెట్టుబడిదారుడంటూ మంత్రి నారా లోకేష్‌తో ఫొటో తీయించడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని ఆరోపించారు. పైగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని చంద్రబాబు ఆరోపించడం ఆయన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికేనన్నారు. తెలంగాణ, మహారాష్ట్రలకు పెట్టుబడులు వెళుతున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దావోస్ పర్యటనకు వెళ్లినపుడు కొన్ని వందల ఎంఓయూలు కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. బాబు దావోస్ పర్యటన వల్ల ప్రభుత్వానికి రూ. 80 కోట్లు ఖర్చయిందే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా సరైన పాలన లేకుండా పోయిందన్నారు. మహిళలపై దురాగతాలు, గంజాయి, పేకాట క్లబ్బులు, కోడి పందేలు, ఇసుక, మట్టి అక్రమ రవాణా, మట్కా వంటివి నిత్యకృత్యంగా మారాయని ఆరోపించారు. సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, పాకా సురేష్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళతాం

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్


గోపాలస్వామిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళతామని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్‌యాదవ్ పేర్కొన్నారు. ఇటీవల ఓ భూ వివాదం కేసులో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామిపై అక్రమ కేసు పెట్టడంతో అరెస్టు కాబడి బెయిల్‌పై విడుదలైన సందర్భంగా శనివారం బద్వేలులోని ఆయన నివాసంలో పలువురు బీసీ నాయకులతో కలిసి గోపాలస్వామి కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రశ్నిస్తున్న ప్రతిపక్షనేతలను, కార్యకర్తలను అక్రమ కేసులతో ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు బంగారునాగయ్య, కొప్పల శివయాదవ్, నేట్లపల్లిశివరామ్, రమణ, రాగంశ్రీధర్, కౌన్సిలర్ వెంకటకృష్ణ, వార్డు ఇన్‌చార్జిలు బుర్రిరాజాయాదవ్, సుధాకర్‌యాదవ్, జయరామ్‌యాదవ్, రమణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ తొలగింపు

త్వరలో నూతన అధికారి నియామకం

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ స్పెషల్ ఆఫీసర్‌ను తొలగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ద్వారా శనివారం ఆదేశాలు వచ్చాయి. ఫలితంగా ఆయన స్థానంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు నూతన స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యదర్శిగా జిల్లా ఉపాధికారి సురేష్‌కుమార్‌ను నియమించారు. విద్యాశాఖ పూర్వ ఉన్నతాధికారి అలపర్తి పిచ్చయ్య చౌదరి చైర్మన్‌గా పూర్తి కాలం సేవలు అందించిన తర్వాత ఆ పోస్టుకు ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్ పోస్టుకు అభ్యర్థులు పోటాపోటీగా నిలువగా సభ్యుల నియామకంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలిసి కొందరు వ్యక్తులు కోర్టుకు వెళ్లారు. ఆ సమస్య ఇంతవరకు పరిష్కారం కాలేదు. అనంతరం 2023 ఆగస్టు 23న శివశంకర్‌రెడ్డిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. రాష్ట్ర మంతటా రెడ్‌క్రాస్ సంస్థలో ప్రస్తుతం ఉన్న స్పెషల్ ఆఫీసర్లను తొలగించి తమకు కావాల్సిన వారిని నియమించుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల నియామకాలు కోర్టులో ఉండగా, వాటిని పూర్తిగా రద్దు చేసి మరీ తమ వారిని తెచ్చుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత


సుబ్బరాయుడుకు బంగారు గొలుసు అందిస్తున్న కండక్టర్ రంగమ్మ, డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రయాణికుడు బస్సులో పోగొట్టుకున్న బంగారు గొలుసును తిరిగి బాధితునికి అందించి కండక్టర్ తన నిజాయితీని చాటుకున్నారు. శనివారం ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోకు చెందిన కడప నుంచి ప్రొద్దుటూరు బస్సులో ఖాజీపేట దుంపలగట్టు గ్రామానికి చెందిన ఎస్.సుబ్బరాయుడు బంగారు గొలుసు పోగొట్టుకున్నాడు. కండక్టర్ రంగమ్మకు బంగారు గొలుసు దొరికింది. బంగారు గొలుసును ప్రొద్దుటూరు ఆర్టీసీ డీపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో బాధితుడికి అప్పగించారు. కండక్టర్ నిజాయితీని డిపో మేనేజర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

భారతి సిమెంట్స్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే చైతన్యరెడ్డి


భారతి సిమెంట్స్ చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రణాళికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం : మండలంలోని నల్లింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎస్ఆర్ నిధులతో చేస్తున్న సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి కొనియాడారు. బీసీసీపీఎల్ సీఎస్ఆర్ నిధులతో కమలాపురం పట్టణంలోని 9వ వార్డు అంగన్వాడీ అంగన్వాడీ కేంద్రంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడారు. గుడ్లు, చిక్కీలు తదితర పోషకాహారం ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను సొంత పిల్లల్లా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. కాగా భారతి సిమెంట్స్ ఐఆర్‌పీఆర్ చీఫ్ మేనేజర్ భార్గవ్ రెడ్డి అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రణాళికల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి మాట్లాడుతూ కమలాపురం పట్టణంలోని ఐదు అంగన్వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు భారతి సిమెంట్స్ ముందుకు రావడం అభినందనీయం అన్నారు. అలాగే స్కూల్స్‌లో కూడా టాయిలెట్లు, ల్యాబ్స్ తదితరవి ఏర్పాటు చేయాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయ కుమారి, అంగన్వాడీ సిబ్బంది, పెయిడ్ ఎన్‌జీఓ నాగేశ్వర్ రెడ్డి, నగర కమీషనర్ పగడాల జగన్నాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'వాహనాలను అతి వేగంగా నడపకూడదు'



మాట్లాడుతున్న ఆర్‌టీఓ మురళీధర్

ప్రొద్దుటూరు : వాహనాలను అతి వేగంగా నడపకూడదని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. శనివారం మండలంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. కారులో వెళ్లేటప్పుడు సీట్ బెల్టు పెట్టుకోవాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలను నడపకూడదని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ రఘునాథ్, వారి బృందం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వర రావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవీంద్రనాయక్, హేమకుమార్, ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ దేవ కిరణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటైనర్- బొలేరో వాహనం ఢీ

ముద్దనూరు : ముద్దనూరు తాడిపత్రి జాతీయ రహదారిలో మండలంలోని కమ్మవారిపల్లె సమీపంలో ఎదురెదురుగా వస్తున్న కంటైనర్, బొలేరో వాహనం ఢీకొన్నాయి. శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్పగాయలయ్యాయి.

లారీ అదుపుతప్పి బోల్తా

మైలవరం : మండల పరిధిలోని వద్దిరాల గ్రామ సమీపంలో తాడిపత్రి రహదారిలో శనివారం సిమెంట్ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. తరచూ ఈ రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు వెళుతున్నాయి. ఎక్కువగా సిమెంట్ కర్మాగారం, కొలిమిగుండ్ల- ప్రంతాల్లో ఉన్న పలు సిమెంట్ కంపెనీలకు తరచు ఫ్లయాష్‌ను రవాణా చేస్తున్నారు. అధిక లోడు ఉండటంతో పాటు వేగంగా వెళుతుండటంతో భారీ వాహనాలు అదుపు చేయలేక ప్రమాదాలకు గురి అవుతున్నాయి.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


తమ్మిశెట్టి శ్రీధర్ (ఫైల్)

వేంపల్లె : స్థానిక శ్రీరాం నగర్ వీధికి చెందిన తమ్మిశెట్టి శ్రీధర్ (15) అనే విద్యార్థి అదృశ్యమయ్యాడని వేంపల్లె ఎస్ఐ రంగారావు తెలిపారు. ఈ మేరకు వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. విద్యార్థి తండ్రి వెంకటేష్ తెలిపిన వివరాలు మేరకు.. ఈ నెల 18వ తేదీన రాత్రి 8 గంటలకు కాలేజీకి చక్రాయపేటకు వెళ్లుతున్నానని చెప్పి ఇంటి నుండి శ్రీధర్ వెళ్లిపోయాడన్నారు. రెండు రోజుల తర్వాత విద్యార్థి తండ్రి తమ్మిశెట్టి వెంకటేష్‌కు కళాశాల నుండి మీ అబ్బాయి కాలేజీకి రాలేదని సమాచారం వచ్చిందన్నారు. చుట్టు పక్కల గ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు

కియా సిరోస్ కారు ఆవిష్కరణ


నూతన కారును ఆవిష్కరిస్తున్న జగన్నాథరెడ్డి

కడప కల్చరల్ : కడప నగరం కర్నూలు రహదారిలోగల హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కారు షోరూంలో శనివారం కియా సిరోస్ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి మాట్లాడుతూ ఈ కారులో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. రీబస్ట్ 20 స్టాండెర్డ్ సేఫ్టీ ప్యాక్, సెకండ్ రో సీట్‌తోపాటు నేటి కాలానుగుణమైన అవసరాలకు తగినట్లుగా పలు ప్రత్యేకమైన ఫీచర్లు, సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమారెడ్డి, కొనుగోలుదారులతోపాటు షోరూం మేనేజర్ ఎస్ఎస్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కారు బుకింగ్ కోసం 9100773485 నెంబరులో సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

మైదుకూరు : సైబర్ నేరాల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా ప్రతినిధి డా.ఉమాదేవి అన్నారు. శనివారం హెల్త్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరమ్మ కాలనీలో అర్బీఐ సౌజన్యంతో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ఉమాదేవి మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. వాటిపై అవగాహన పెంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆర్థిక పరిజ్ఞానం కూడా ఉండాలని, పొదుపు ఖర్చులు క్రమ పద్ధతితో చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీకాలేజీ అధ్యాపకుడు నవనీశ్వర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు పెరుగు కృష్ణయ్య యాదవ్ పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా జేష్టాది భాస్కర్

ప్రొద్దుటూరు : మాలమహానాడు (పీవీ రావు వర్గం) జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆదేశాల మేరకు విజయవాడ మినర్వా గ్రాండ్‌లో జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచ నాగమల్లేశ్వరి కడప జిల్లా అధ్యక్షుడిగా జేష్టాది భాస్కర్‌కు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా శనివారం జేష్టాది భాస్కర్ మాట్లాడుతూ తను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, జాతీయ మహిళా అధ్యక్షురాలు నాగ మల్లేశ్వరిలకు ధన్యవాదాలు తెలిపారు.

జేసీ క్యాంపు కార్యాలయంలో చోరీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జిల్లా జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రింటర్, సీపీయూలను చోరీచేశారు. ఈ సంఘటనపై కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య


మృతి చెందిన చిన్నిగాళ్ల బుజ్జి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల- ముద్దనూరు రైల్వే స్టేషన్‌ల మధ్యలోని సున్నపురాళ్లపల్లె గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై అదే గ్రామానికి చెందిన చిన్నిగాళ్ల బుజ్జి (49) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. మృతురాలికి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలికి భర్త యేసయ్యతో పాటు ముగ్గురు సంతానం ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు